ప్రజాశక్తి
గురువారం 19 జనవరి 2023
5
విజయనగరం



ఘనంగా సైనిక స్కూలులో రైజింగ్ డే

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

కోరుకొండ సైనిక స్కూలులో 61వ రైజింగ్ డే బుధవారం పివిజిరాజు ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక అసెంబ్లీ, క్యాడెట్ బి.గగన్ మనోజ్, కార్తీక్ పూనియా, రూపేష్ రోనంకి పదో తరగతి నుంచి ఇంటర్ తరగతులకు సంబంధించి ఇప్పటివరకు పాఠశాల సాధించిన విజయాలను వివరించారు. త్రివిధ సాయుధ సేవల్లోని ప్రముఖ సైకోరియన్‌లను గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపల్ కల్నల్ అరుణ్ ఎం. కులకర్ణి మాట్లాడుతూ వివిధ రంగాల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని తెలిపారు. సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పూర్వ విద్యార్థులకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. పూర్వీకులు నిర్దేశించిన బెంచ్‌మార్క్‌ను నిలబెట్టుకోవడమే కాకుండా మరింత ఉన్నత శిఖరాలను సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

రంగు మారిందని రాద్ధాంతం

- నిబంధనలకు తూట్లు
- రైతులు నష్టపోకుండా ఆదుకోవాలి : రైతు సంఘం



ప్రజాశక్తి - జామి

జిల్లాలో రంగు మారిన దాన్యంపై మిల్లర్లు రాద్ధాంతం చేస్తున్నారు. రంగు మారిన, చెడిపోయిన ధాన్యం పేరుతో రైతుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యానికి నిర్దేశించిన ధరలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి నిలువునా దేచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు, రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగు మారిన ధాన్యానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి రైతులు నష్టపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 2.5లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పటికే కొంత మేరకు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసినా, నాసిరకం పేరుతో ధరలో కోత విధించి, అదనపు ధాన్యం పేరుతో దోపిడీ చేశారు. తాజాగా అత్యధిక మిల్లులకు బ్యాంకు గ్యారెంటీ పూర్తయిన నేపథ్యంలో కొనుగోలును 90శాతం నిలిపివేశారు. అక్కడక్కడా కొనుగోలు జరుగుతున్నప్పటికీ నాశి రకం పేరిట రైతులను నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఒకవైపు రంగు మారిన, చెడిపోయిన ధాన్యం కొనుగోలుకు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రంగు మారిన ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను రైతు సంఘం డిమాండ్ చేస్తుంది.

రైతులు నష్టపోకుండా చూడాలి

జిల్లా లో తడిసిన, రంగు మారిన, ధాన్యం10శాతం ఉన్న రైతులకు కొనుగోలుకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక అతి తక్కువగా క్వింటా రూ.900 నుంచి రూ. 1100కు రైతుల నుంచి గుంజుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలుకు ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

- బి రాంబాబు,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

చెడిపోయిన, రంగు మారిన ధాన్యం బహిరంగ మార్కెట్ లో మిల్లర్లు కొనుగోలుకు నిర్దేశించిన మార్గదర్శకాలు ఇవే

చెడిపోయిన శాతం	క్వింటా ధర	75 కేజీలు ధర
10శాతం	రూ.1930	రూ.1450
10- 20శాతం	రూ. 1750	రూ. 1325
20- 30శాతం	రూ.1530	రూ.1150
30- 40శాతం	రూ.1400	రూ. 1050
40% పైన	రూ.1300	రూ.1000

నేర స్థలాన్ని పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని వెలగవలస శివార్లలో గల మామిడి తోటలో హత్యకు గురైన గుర్తు తెలియని వ్యక్తి కేసులో నేర స్థలాన్ని బుధవారం ఎస్పి ఎం.దీపిక, ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు పరిశీలించారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్య కేసు మిస్టరీని చేధించేందుకు ప్రత్యేక బృందాలను నియమించి, దర్యాప్తు వేగవంతం చేయాలని సిఐ ఎస్.తిరుమలరావును ఎస్పి ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఇక్కడ మామిడితోటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే.


ఆధారాలు పరిశీలిస్తున్న ఎస్పి

రూ. 15 కోట్లతో రాజాం - పాలకొండ రోడ్డు పనులు

- రాజాంలో రోడ్ల విస్తరణ పనులను సమన్వయంతో చేపట్టాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశం
- రూ.20 కోట్లతో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన



రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-రాజాం

రోడ్లుభవనాలశాఖ ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో విజయనగరం - పాలకొండ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లకు అదనంగా మరో రూ.10 కోట్లు కట్టడాలు, భవనాలకు నష్టపరిహారం చెల్లింపు తదితర వాటికి అవసరమని గుర్తించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో సంప్రదించి, వారితో సమన్వయంతో పనిచేయడం ద్వారా రోడ్ల విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. రాజాం పట్టణంలో ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో చేపట్టనున్న నాలుగు కిలోమీటర్ల రోడ్ల విస్తరణ పనులకు మంత్రి బుధవారం బి.ఆర్.అంబేద్కర్ కూడలి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సూర్యదుర్గ కళ్యాణమండపంలో ప్రజాప్రతినిదులు, జిల్లా అధికారులతో రోడ్డువిస్తరణ పనులపై సమీక్ష నిర్వహించారు.

రోడ్డు విస్తరణలో భవనాలు, కట్టడాలు కోల్పోయిన వారికి రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సి వుంటుందని, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న వారు పరిహారం నగదు రూపంలో చెల్లించాలని కోరుకుంటున్నారని పట్టణ ప్రణాళిక అధికారి మంత్రికి వివరించారు. ప్రభుత్వం ద్వారా పరిహారం నగదు రూపంలో చెల్లింపులకు అవకాశం వుంటే పరిశీలిస్తామని, లేనిపక్షంలో టి.డి.ఆర్.బాండ్లు జారీచేసి అనంతరం వాటిని నగదుగా మార్చుకొనే అవకాశం కల్పిస్తామని మంత్రి అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.6 కోట్ల మేరకు విద్యుత్ స్థంభాలు, లైన్ల మార్పిడికి అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు వివరించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో పైప్‌లైన్ల మార్పిడి కోసం రూ.3 కోట్లు అవసరం వుంటుందని ఆ శాఖ ఎస్.ఇ. ఉమాశంకర్ వివరించారు. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖకు చెందిన తాగునీటి డిస్ట్రిబ్యూషన్ మెయిన్ల మార్పుకోసం మరో రూ.3.20 కోట్లు అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు ఆ శాఖ డిఇ తెలిపారు. రోడ్లు విస్తరణ పనుల్లో భాగంగా రెండు కిలోమీటర్ల మేరకు డ్రెయిన్ల నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి ఆటంకాలు లేనందున ముందుగా డ్రెయిన్ల పనులు ప్రారంభించాలని రోడ్లు భవనాల శాఖ ఇఇ రమణను మంత్రి ఆదేశించారు. ఈలోగా బాధితులకు పరిహారం చెల్లింపు వంటి పనులు పూర్తి చేయాలన్నారు. విస్తరణలో భాగంగా పైప్‌లైన్లు, విద్యుత్ లైన్ల మార్పు కోసం నిధులు అవసరమైన ప్రభుత్వ శాఖలు తమ ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని మంత్రి సూచించారు. రోడ్ల విస్తరణ పనులు పదిహేను నెలల్లో పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బొబ్బిలి జంక్షన్‌కు సమీపంలో అవసరమైన మరో కల్వర్టు నిర్మాణాన్ని కూడా విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

రాజాం నుంచి పాలకొండ రోడ్డును కూడా రూ.15 కోట్లతో పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని మంత్రి తెలిపారు. సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం జెడ్‌పి వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్మోహన్, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేడాడ తిలక్, ఆర్‌డిఒ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ కష్ణారావు, తహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్లను మంత్రి, కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్నవైసిపిజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

20లోగా గృహ సారధుల నియామకం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20వ తేదీలోగా గృహ సారథుల నియామకం పూర్తి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం జగన్నాథ కన్వెన్షన్ హాల్లో వైసిపి విజయనగరం, మన్యం జిల్లాల మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల జెసిఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, మన్యం జిల్లా అధ్యక్షులు శ్రీ శత్రుచర్ల పరీక్షిత్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 20లోగా గృహ సారథుల నియమకాన్ని పూర్తిచేసుకుని జాబితాను జిల్లా, కేంద్ర కార్యాలయానికి పంపించవలసిందిగా సూచించారు. సమావేశంలో శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి,ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, పాముల పుష్పశ్రీవాణి, విశ్వసరాయ కళావతి, అలజంగి జోగారావు, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్ బాబు, పాలవలస విక్రాంత్, నియోజక వర్గాల పరిశీలకులు, నాయకులు పాల్గొన్నారు.

అటవీ భూములపై హక్కు కల్పించాలి

- తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా


ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏళ్ల తరబడి సాగులో ఉన్న అటవీ భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద మెంటాడ మండలం ఆగూరుకు చెందిన గిరిజనులు ధర్నా చేశారు. తమ భూములను కబ్జా చేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డులను తారుమారు చేసిన స్థానిక తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాకోటి రాములు మాట్లాడుతూ ఆగూరు రెవెన్యూ పరిధిలోని సంఘం గుడ్డివలస, కింద గూడెం, పనుకువాని వలస, సిడగం వలస, రాయవలస, ఎర్రాడవలస గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్ట్ భూమిపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని, కబ్జాకు పాల్పడిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నెం. 239, 240 241 242లలో సుమారు 70 ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ భూమిని సుమారు 70 కుటుంబాలు తాతల కాలం నుండి సాగు చేస్తున్నారని, జీడి, వరి, పత్తి, వంకాయ మొదలగు పంటు పండించుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పట్టాలివ్వాలని అనేక దఫాలుగా అధికారులకు వినతులు అందజేశారని, గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్లు పట్టాలిస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయినా నేటివరకు పట్టాలు రాక చాలా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. బండారు సంజీవరావును, అతని అనుచరులు తమ భూములను ఆక్రమించుకొని, గ్రామాలు విడిచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. ఇందులో 20 ఎకరాలు ఫారెస్ట్ భూమి గజపతినగరం మండలం కొణిసి గ్రామానికి చెందిన పెనుమత్స రాజశేఖరరాజు తదితరులు దౌర్జన్యంగా హక్కులు పొందారని తెలిపారు. పెత్తందారులకు కొమ్ముకాసిన తహశీల్దార్ రవిపై చర్య తీసుకొని, తమ భూములపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గేదెల పెదరాము, జి.సన్యాసిరావు, ఎస్.జానకిరామ్, ఈదుబిల్లి సన్యాసిరావు, గణేష్, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

భూ రీసర్వేలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో అక్రమాలు జరిగాయని, అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో భూరీసర్వేలో అక్రమాలు జరగడంతో పేద రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. రామభద్రపురం మండలం గొల్లలపేటలో సర్వే నెంబర్ 210లో 12.30 ఎకరాల భూమిని ఏళ్ల తరబడి పేద రైతులు సాగు చేస్తే సాగు చేసే రైతులకు భూమి రాయకుండా అనర్హులకు భూమి రాసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బినామీ పేర్లను ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. బొబ్బిలి మండలం గొర్లె సీతారాంపురం రెవెన్యూలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు రాయకుండా అనర్హులు పేరు మీద ఆన్‌లైన్ చేశారన్నారు. రామభద్రపురం మండలం కొండ కెంగువ రెవెన్యూలో ఐదు ఎకరాల భూమిని అనర్హులకు రాస్తే ఆర్‌డిఒకు ఫిర్యాదు చేయడంతో అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కొండకెంగువ రెవెన్యూలో 200 కుటుంబాలు ప్రభుత్వ భూమి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాయని, వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వకుండా పెద్దలకు అప్పగిస్తున్నారని అన్నారు. పేదలకు భూమి ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. లేదంటే పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ఉత్తమ సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాజాం

సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. గార చీపురుపల్లి గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరును పరిశీలించి వివిధ రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. సిబ్బందిలో వారికి నిర్దేశించిన విధులను ఏవిధంగా చేస్తున్నారు, సచివాలయానికి వచ్చే సందర్శకుల పట్ల ఏవిధంగా స్పందిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. గ్రామ ప్రజలతో సిబ్బంది మమేకమై గ్రామస్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని పేర్కొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొనాలి

మండల సర్వ సభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - జామి



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు జి.సరయు

మండలంలో రైతు పండించే ప్రతి ధాన్యపు గింజని ప్రభుత్వం కొనుగోలు చేసి తీరాలని మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు జి.సరయు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధాన్యం కొనుగోలు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి, రైతుల ఇబ్బందులు తీర్చాలని అధికారులను సూచించారు. ఇప్పటివరకు మండలంలో 10వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ, ఇంకా రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. అనంతరం మండలంలోని పలు శాఖల పనితీరు పై చర్చించారు. సమావేశంలో ఎంపిడిఒ సతీష్, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, తహశీల్దార్ హేమంత్ కుమార్, పలు శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డివి రమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడలో బుధవారం జరిగిన ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికల్లో విజయనగరం జిల్లా తరపున వరుసగా ఐదో సారి డి వి రమణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ లో సహాయ మలేరియా నివారణ అధికారిగా పనిచేస్తున్నారు. మరొక సారి ఎన్నికైన రమణకు అధ్యక్ష కార్యదర్శులు జె. మురళి, ఎ.సురేష్ అభినందనలు తెలిపారు.

ఖేల్ ఇండియా బాక్సింగ్ రాష్ట్ర జట్టుకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఈనెల 30 నుండి వచ్చేనెల 11 వరకు ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ జరుగనున్న నేపథంలో రాష్ట్ర జట్టుకు శిక్షణ ప్రారంభమైంది. బాక్సింగ్ క్రీడా విభాగంలో ఆరుగురు బాలురు , నలుగురు బాలికలకు స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ డిఎస్ఎ బాక్సింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో కోచింగ్ క్యాంప్‌ను బుధవారం ప్రారంభించారు. ద్రోణాచార్య అవార్డ్ గ్రహీత ఐ. వెంకటేశ్వర రావు దీన్ని ప్రారంభించారు. ముఖ్య శిక్షకులు పి.అప్పలనాయుడు, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణ్ దేవ్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.మన్మథకుమార్, బాక్సింగ్ కోచ్‌లు బి.ఈశ్వర్ రావు, ఆర్.విశ్వనాథ్ పాల్గొన్నారు.


ఆర్‌టిసి డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అరకు- విశాఖపట్నం డీలక్స్ బస్సు సర్వీసులో అరుకు తహశీల్దార్ వేణుగోపాల్ తన పర్స్‌ను మంగళవారం బస్సులో పోగొట్టుకొని బస్సు దిగి వెళ్లిపోగా డ్యూటీ డ్రైవర్ గంగరాజు పర్స్ భద్రపరిచి ఎస్ కోట డిపో మేనేజర్ రమేష్‌కు అప్పగించారు. డిపో మేనేజర్ ఆ పర్స్‌ను బుధవారం తహశీల్దార్‌కు అందజేశారు.పర్సులో రూ.4,700 నగదు, గుర్తింపు, ఎటిఎం కార్డులు ఉన్నాయి. తన పర్సు అందజేసినందుకు తహశీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు.

రూ.6వేల కోట్లతో నాబార్డు రుణ ప్రణాళిక

- వ్యవసాయ రుణాలకు అధిక ప్రాధాన్యత
- బ్యాంకర్ల సమావేశంలో జెసి మయూర్ అశోక్


రుణ ప్రణాళిక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న జెసి మయూర అశోక్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం

నాబార్డ్ ద్వారా వ్యవసాయానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. నాబార్డ్ 2023 -24 ఆర్థిక సంవత్సరానికి 6 వేల 95 కోట్ల రూపాయలతో రూపొందించిన రుణ ప్రణాళికను సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం ఎల్.డి.ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాబార్డ్ రుణ ప్రణాళికలో వ్యవసాయ రుణాలు, వ్యవసాయ ఉత్పత్తులు, నిర్వహణ, మార్కెటింగ్, జల వనరులు, వేస్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్, పశు సంవర్థకం, డెయిరీ, పౌల్ట్రీ, మత్స్య సంబంధిత రంగాలకు రూ. 3, 685 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. మిగతా నిధులు వ్యవసాయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ , ఇంధన వనరులు, విద్య, హౌసింగ్ తదితర రంగాలకు కేటాయించామన్నారు. ఈ రుణ పరపతిపై అవగాహన కలిగించుకొని, సంబంధిత లబ్దిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది గ్రౌండింగ్ జరిగిన పథకాలన్నీ ఈ మార్చి నెలాఖరు లోగా మంజూరు చేసి నగదు బట్వాడా జరగాలన్నారు. ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ, డిఆర్‌డిఎ, వ్యవసాయ, హౌసింగ్ కు సంబంధించిన పథకాల కోసం మంజూరైన నిధులన్నీ వెంటనే లబ్ది దారుల ఖాతాలలో పడేలా చూడాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా పరిగణిస్తున్నందున చిరు ధాన్యాల సాగును ప్రోతహించాలని తెలిపారు. ఈ క్రాప్ డేటా ను పంట వారీగా, రైతు వారీగా నమోదు చేసి అర్హత మేరకు పంట రుణాలను విరివిగా అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి త్రినాథ స్వామి కి సూచించారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న తోడు 5వ విడత దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే చెల్లించాలని, తర్వాత 6 వ విడత దరఖాస్తులను గ్రౌన్డింగ్ చేయాలనీ బ్యాంకు అధికారులకు తెలిపారు. గృహాలకు సంబంధించి రుణాలను ఎలాంటి పెండింగ్ లేకుండా మంజూరు చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయిలో ఎపిఎంలు, స్థానిక బ్యాంకు అధికారులు కలసి అవగాహన కలిగించాలన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను వివరించేందుకు కళాశాలల్లో అవగాహనా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, రిజర్వు బ్యాంకు ప్రతినిధులు, జిల్లాలోని అన్ని బ్యాంకు లకు చెందిన అధికారులు, జిల్లా అధికారులు డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ రమణ, మత్స్య శాఖ డిడి నిర్మలా కుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి కాంప్లెక్సులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలో తప్పని తిప్పలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో తమ స్వగ్రామాలు చేరుకున్న వలస కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పండుగ అనంతరం తిరుగుముఖం పట్టారు. ఈనేపథ్యంలో బుధవారం వందలాది మందితో విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. సకాలంలో వివిధ ప్రాంతాలకు బస్సులు రాకకోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. తిరుగు ప్రయాణంలో తగినన్ని బస్సులను ఏర్పాటు చేయడంలో ఆర్‌టిసి అధికారులు విఫలమయ్యారు. విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి వెళ్లేందుకు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

సేవలతోనే ముందుకు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు అవసరమైన సేవలు అందించటం తోనే రోటరీ సంస్థ ముందుకు వెళ్తున్నదని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు అన్నారు. బుధవారం స్థానిక శ్రీ సూర్య మినీ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ డైరెక్టర్‌ల సమావేశం కార్యదర్శి శ్రీ హరి నిర్వహించారు. జె సి రాజు మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు మరెంత చేరువ చేయాలని, సభ్యులు సహకారం అందించాలని కోరారు. ఫిబ్రవరి నెలలో రోటరీ ఆధ్వర్యంలోటైలరింగ్ నేర్చుకొన్న అర్హులైన 110 మంది పేదలకు మోటార్ తో కూడిన కుట్టు మిషనులను పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కళాభారతి వద్ద బస్ షెల్టర్ ను నిర్మిస్తామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల కాలేజి రోడ్లో నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు. రోటరీ జిల్లా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్సు ఈ నెల 28, 29 తేదీలలో మంజీర ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహిస్తున్నారని, ఈ కాన్ఫరెన్స్ ప్రముఖ ప్లే బ్యాక్ సింగెర్స్ రామ చంద్ర, రమ్య బెహెరా, లిప్సిక హాజరవుతారని తెలిపారు. గెస్ట్ స్పీకర్స్ గా తనికెళ్ళ భరణి, రాఘవేంద్ర హాజరవుతారని తెలిపారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్ వార్షిక ఆదాయ అవసరాలపై గురువారం నుంచి ఈనెల 21 వరకు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు ఇఇ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారుకు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలను చెప్పాలని కోరారు.

విశాఖ సంస్కృతి సంక్రాంతి సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

గాజులరేగలోని సీతం కళాశాలలో విశాఖ సంస్కృతి సంక్రాంతి సంచికను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు విశాఖ సంస్కృతి మాసపత్రిక ముఖ చిత్రంగా ఉండడం చాలా ఆనందంగా ఉందన్నారు. మన కట్టు, బొట్టు ప్రత్యేక మైనవని, భారతీయులు ప్రపంచంలో ఏ మూలాన ఉన్నా గుర్తు పట్టవచ్చని అన్నారు. కళాశాలలో విద్యతో పాటు మన సంస్కృతిని ప్రతబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్న కళాశాల డైరెక్టర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

విఆర్ఒపై డిప్యూటీ కలెక్టర్ దర్యాప్తు

ప్రజాశక్తి -వేపాడ

కేజీ పూడి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న విఆర్ఒ వి.అప్పలనాయుడు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు అతన్ని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ సన్యాసిరావు, ఆర్ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

జీవో ఒకటిని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉన్న జీవో నెంబర్ 1ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జనసేన నాయకులు గురాన అయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోడ్ షోలు, సభలపై ఆంక్షలు విధిస్తూ జగన్ ప్రభుత్వం తెచ్చిన జిఒ నెంబరు 1ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇటీవల రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చిందని, ఆ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ జిఒ -1పై ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్షనేతలపై కక్షసాధింపు కోసం ఇచ్చే ఇటువంటి జీవోలు న్యాయస్థానాల్లో నిలబడవని అన్నారు. జనసేన బలం గురించి , పొత్తుల గురించి స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల అవగహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. పొత్తు ఉన్నా,లేకపోయినా కోలగట్లను ఇంట్లో కూర్చోబెట్టడం ఖాయమని అన్నారు. ఉత్తరాంధ్ర లో రైతులు సంతోషంగా వున్నారని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించడం ఆశ్చర్యంగా వుందన్నారు. గ్రామాల్లో తిరిగితే రైతులు పడుతున్న కష్టాలు తెలుస్తాయన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్నజెఎన్‌టియుజి డీన్ కెసిబి రావు

ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ, ఇఇఇ విద్యార్థులకు విశాఖకు చెందిన గీతం యూనివర్శిటీ సహకారంతో 'ల్యాబ్ వ్యూ రియల్‌టైం అప్లికేషన్' అనే అంశంపై ఏడు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నారు. బుధవారం ఈ శిక్షణను జెఎన్‌టియు గురజాడ డీన్ అండ్ అకడమిక్ ప్లానింగ్ డాక్టర్ కెసిబి రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ల్యాబ్ వ్యూ లాంటి సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఇసిఇ విభాగ అధిపతి డాక్టర్ ఎం. సునీల్ ప్రకాష్ మాట్లాడుతూ సాంకేతిక విద్యలో ల్యాబ్ వ్యూ ప్రాముఖ్యత వివరించారు. ఇఇఇ విభాగ అధిపతి డాక్టర్ శరత్ కుమార్ సాహు, గీతం యూనివర్శిటీ ఎస్‌టియుటిఐ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బి. శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎల్ రాజు, ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ రమేస్, ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ వలి తదితరులు మాట్లాడారు.

ఘనంగా పిసిసి అధ్యక్షులు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు రమేష్ కుమార్ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు రుద్రరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. శ్రీనివాసరావు, స్టేట్ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ షరీఫ్, మైనార్టీ విభాగం కి చెందిన రెహ్మాన్ , మండల అధ్యక్షులు తెలుగు సూరిబాబు, చిలక రాజు, వెంకట్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఖ్యాతి చాటిన ఎన్‌టిఆర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు వర్ధంతి సందర్భంగా ఆయనకు బుధవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి.

నగరంలోని కోట జంక్షన్, కలెక్టరేట్,మున్సిపల్ కార్యాలయం వద్దగల ఎన్‌టిఆర్ విగ్రహాలకు మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఖ్యాతికి విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఆయన ప్రజల మనిషి అని, ప్రజల మధ్య తిరిగారని, ఆయన వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ప్రజలకు నిజమైన రాజకీయం అంటే ఏమిటో తెలిసిందని అన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇప్పుడు రాష్ట్రంలో అప్పులు తో కూడికపోయిందని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి జీవోలను తీసుకొచ్చి ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తుందన్నారు.నేడు రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక పాలన పోవాలంటే మరల టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నగర కార్యదర్శి బంగారు బాబు. పట్టణ నాయకులు కనకల మురళీమోహన్ , రొంగలి రామారావు తదితరులు పాల్గొన్నారు. విటి అగ్రహారంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ రొంగలి రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

నెలిమర్ల : రామ తీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, జరజాపు పేట ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు మాజీ మంత్రి పతి వాడ నారాయణ స్వామి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు లెంక అప్పలనాయుడు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి లీలా వతి, అవనాపు సత్య నారాయణ, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, నాయకులు గురాన అసిరి నాయుడు,బొంతు వెంకట రమణ, గురాన రామారావు, కోట పాటి తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎంఎల్ఎ కెఎ నాయుడు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేపాడ : ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

గుర్ల : ఎస్ఎస్ ఆర్ పేట మాజీ సర్పంచ్ కమ్మిండి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున హాజరై పేదలకు బట్టలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ టి ఆర్ ఆశయాలను నెరవేర్చ డానికి అందరూ కలసి పని చేయాలన్నారు. చింతలపేట, గుర్లలో ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బి సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు, నాయకులు తిరుమలరాజు కిరణ్‌కుమార్, గొర్లి రాము నాయుడు, కిలారి సూర్యనారాయణ, పిల్లా అప్పల

బొబ్బిలి : కోట నుంచి ర్యాలీగా వెళ్లి ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నెంబర్ వన్ ఇందుకు సాక్షామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం : మాజీ మంత్రి కోండ్రు మురళీ ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వృద్ధులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ



బొబ్బిలి : ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సుజయ్‌కృష్ణ రంగారావు

చైర్మన్ కోళ్ల అప్పల నాయుడు, రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల అధ్యక్షులు, రాజాం టౌన్ అధ్యక్షులు, మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎన్ఆర్ఐ, టిడిపి నాయకులు గొంప కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీతో ప్రధాన రహదారి గుండా ర్యాలీగా వల్లంపూడివద్దగల ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కారక్రమంలో జనపరెడ్డి ఈశ్వరరావు, ముక్క రామకృష్ణ, సిరికి రమణ, సిరికి సూర్యనారాయణ, మంచిన అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : అక్కివరం, చింతలవలసలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు పల్లె భాస్కరరావు తదితరులు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పినతాడివాడని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, అసుపత్రి సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కాగితాల సత్యనారాయణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, మండల టిడిపి ఉపాధ్యక్షులు పడాల చిన్నారావు, చింతలవలస గ్రామ పార్టీ నాయకులు పిన్నింటి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ చీకటి సుహాసిని, మాజీ సర్పంచ్ సవరవిల్లి సత్యవతి, పాలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం : ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్‌గజపతిరాజు, టిడిపి నాయకులు

శృంగవరపుకోట : పట్టణంలోని దేవి కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, వైస్ ఎంపిపి నానిగిరి రమణాజి, గ్రామ పార్టీ అధ్యక్షులు కె.మల్లీశ్వరరావు, కాపుగంటి శ్రీనివాసు, చక్కా కిరణ్‌కుమార్ అనకాపల్లి చెల్లయ్య, కనిశెట్టి ఈశ్వరావు, వాకాడ బాలు, గాలి సన్యాసి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భోగాపురం : మండలంలోని పోలిపల్లి గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు, వృద్ధులకు పులిహోర పొట్లాలు, స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక సిహెచ్‌సిలో రోగులకు, రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటరీ కార్య నిర్వహణ కార్యదర్శి కర్రోతు రాజు, తెలుగు యువత అధ్యక్షులు తోగులు రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జిలు దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరా, నీలాపు రామిరెడ్డి, కోరాడ తాతారావు, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసిలు తిరుపతిరావు, చంద్ర, పార్టీ నాయకులు చింతల చిన్నమ్మ తల్లి, వెంకటి, రామి నాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము ఆధ్వర్యాన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చైతన్య బధిరుల సంక్షేమ వసతి గృహంలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు కోళ్ల వెంకట రమణ (శ్రీను), పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు తిక్కాన చినదేముడు, ఉపాధ్యక్షులు లెంక శ్రీను, కొత్తవలస మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల : ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీమంత్రి పతివాడ

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ప్రణాళికాయుతంగా వ్యవహరించి గతంకంటే మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. ఈనెల 26న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఘనతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై ఆమె బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో ఎలాంటి సమన్వయ లోపం తలెత్తకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆయా విభాగాల నుంచి నిర్వహించే కార్యక్రమాల జాబితాలను, శకటాల ప్రదర్శనలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులకు అందజేయాలని సూచించారు. అన్ని వర్గాల, అన్ని రంగాల విజయాలను ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు.

చిట్టిగురువులు, సఖి గ్రూపుల ద్వారా సాధించిన విజయాలను ప్రజలకు తెలిపేలా ప్రదర్శనలు సిద్ధం చేయాలని చెప్పారు. స్వచ్ఛ సంకల్పం, రీ సర్వే, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న కాలనీలు, వైద్యరంగంలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రగతి, సేంద్రీయ వ్యవసాయ విధానాలు, నీటి వనరుల పొదుపు, పాఠశాలల్లో నాడు నేడు పనులు, జాతీయ ప్రాజెక్టుల ప్రగతిని వివరిస్తూ శకటాలను ప్రదర్శించాలని సూచించారు. అవయవాల దానం గురించి తెలుపుతూ ప్రదర్శన ఏర్పాటు చేయాలని రెడ్ క్రాస్ విభాగం అధికారులను, క్రీడలకు సంబంధించిన ప్రదర్శనలు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని క్రీడా ప్రాధికార సంస్థ అధికారులను ఆదేశించారు.

తినుబండారాల విక్రయ స్టాళ్లకు ప్రాధాన్యత

ఎప్పుడూ షరామామూలుగా పెట్టే ప్రదర్శనల స్టాళ్ల కన్నా.. తినుబండారాల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విక్రయాలకు సంబంధించిన స్టాళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూర్యకుమారి అభిప్రాయపడ్డారు. డిఆర్‌డిఎ, వ్యవసాయ విభాగం, ఐసిడిఎస్, మెప్మా, మార్క్ ఫెడ్, మత్స్య శాఖల పరిధిలో అప్పటికప్పుడే తినగలిగే తినుబండారాల విక్రయ స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం. గణపతిరావు, ఆర్డీవో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

చెరకు కాటా ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని రంగరాయపురంలో చెరకు కాటాను బుధవారం డిసిసి జివివి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమానికి సంకిలి పారీ ఇండియా లిమిటెడ్ సుగర్ ఫ్యాక్టరీ ఎజిఎం కె.అప్పారావు, గ్రామ సర్పంచ్ ఉడుముల గోవింద తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులంతా ఈ సదవకాశాన్ని వినియోగించుకొని అధిక విస్తీర్ణం లో చెరకు పంట సాగు చేయాలని కోరారు. ఎజిఎం మాట్లాడుతూ ప్రతి చెరకు ముక్కను వదలకుండా తీసుకుంటామని తెలిపారు. చెరకు పూర్తయిన తరువాతే గానుగను



కాటాను పరిశీలిస్తున్న డిసిసి సత్యనారాయణ

ముగిస్తామన్నారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించవద్దని సూచిచారు. పండగ వరకు 46000టన్నుల చెరకు సంకిలి కి తరలించామని, ఈనెల 5వ రకు చెరకు రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయని

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కమిషనర్ యస్. శ్రీనివాసరావు బుధవారం అమ్మిగారి కోనేరు గట్టు, గొల్లపల్లి దాడితల్లి కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కొత్తగా వేసిన వెంచరును పరిశీలించి దానికి తగిన అనుమతులు ఉన్నవి లేనిదీ తెలియజేయాలని వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులరేషన్ సెక్రటరీకి సూచించారు. దాడి తల్లి కాలనీలో నిర్మాణాలను పరిశీలించి వాటికి ప్లాన్లు ఉన్నది లేనిది తెలియజేయాలని ఆదేశించారు. కాలువలను, కల్వర్టును పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై అక్కడక్కడ ఉన్న చెత్తలను తొలగించాలని వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ వారికి ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

జారిపడి మహిళ మృతి

పజాశక్తి - వేపాడ

సోంపురం జంక్షన్ నుండి కరకవలస ద్విచక్రవాహనంపై వెళుతూ బుధవారం జారిపడిపోయి గాయాల పాలైన సేనాపతి ఎర్రయ్యమ్మ(55) విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె కుమార్తె గోకడ లీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

వేపాడ : మండలంలోని పాటూరులో జరుగుతున్న కోడి పందేలపై దాడి చేసి నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.500 స్వాధీనం చేసుకున్నట్లు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పిడిఎఫ్ బియ్యం పట్టివేత

మండలంలోని గబ్బిరాజుపేట జంక్షన్ వద్ద బొలెరో వాహనంతో తరలిస్తున్న 1300 కిలోల పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నాటుసారాతో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

నాటుసారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. రామభద్రపురం మండలం జోగిందొరవలస గ్రామానికి చెందిన కురిడి సోములు, కురుడి ఆదన్నదొర, పెదకాపు చిన్నారావు 20 లీటర్లు నాటుసారా రవాణా చేస్తుండగా దాడి చేసి నాటుసారాను సీజ్ చేసి ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని చెప్పారు. నాటుసారా తయారు చేసిన, అమ్మిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా నివారణకు 9440902372 కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎస్ఐ చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, ఆదినారాయణ, సరస్వతి పాల్గొన్నారు.

21న సీజ్ చేసిన వాహనాలకు వేలం

నాటుసారా, అక్రమ మద్యం కేసులలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు ఈనెల 21న ఎస్ఇబి కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఆర్.జైభీమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొవాలని కోరారు.